## పేదింటి బిడ్డకు 'హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్' ఉద్యోగం

### కోచింగ్ లేకుండా కొలువు సాధించిన ఉపేంద్రమ్మ




ఉద్యోగ నియామకపత్రాన్ని తీసుకొంటున్న ఉపేంద్రమ్మ

కూసుమంచి, మే 1: ఓ పేదింటి బిడ్డ.. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్'గా ఎంపికై ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. కోచింగ్ తీసుకునే ఆర్థిక స్తోమత కూడా లేని ఆమె.. ఇంట్లోనే ఉంటూ సొంతంగా ప్రిపేర్ అయి ప్రభుత్వ కొలువు సాధించింది. అసలే నిరుపేద కుటుంబం. తండ్రి కూడా చిన్నతనంలోనే చనిపోయాడు. ముగ్గురు కుమార్తెలకు, ఒక కుమారుడికి తల్లి ఒక్కతే పెద్ద దిక్కు. పోలీసు స్టేషన్‌లో స్వీపర్‌గా పని చేస్తూ తన నలుగురు పిల్లలను పోషించుకుంది ఆ మాతృమూర్తి. ఆమె పేరు భారతమ్మ. ఆమెది కూసుమంచి. తన ముగ్గురు కుమార్తెల్లో ఒకరి పేరు ఉపేంద్రమ్మ. తన తల్లి కష్టాన్ని చూసిన ఉపేంద్రమ్మ.. విద్యలో ఉన్నతంగా రాణించి ప్రభుత్వ కొలువు సాధించి కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించింది. కోచింగ్‌కు వెళ్లేందుకు కూడా కనీస నగదు లేని పరిస్థితి. దీంతో ఇంటి వద్దనే ఉంటూ కొలువుల సాధనకు సిద్ధమైంది ఉపేంద్రమ్మ. సన్నద్ధతే లోకంగా కఠోరంగా శ్రమించింది. ఇటీవలి టీజీపీఎస్సీ పరీక్షల్లో గ్రేడ్–2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాన్ని సాధించింది.

కూసుమంచికి చెందిన కొండా ఉపేంద్రమ్మ అనే యువతి.. కూసుమంచి హైస్కూల్లో 10వ తరగతి, కూసుమంచి జేవీఆర్ కళాశాలలో ఇంటర్, ఖమ్మం ఆర్‌జేసీ కాలేజీలో డిగ్రీ పూర్తిచేసింది. కుటుంబ పోషణకు, పేదరికం నుంచి బయటపడేందుకు ఉద్యోగం సాధించడమే ఏకైక మార్గమని నిర్ధారించుకుంది. అది కూడా గ్రూప్సే కావాలని సంకల్పించింది. ఇంటి వద్ద ఉంటూనే ప్రిపేర్ అయింది. ఆఖరికి విజయం సాధించింది. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపికైంది. ఈ మేరకు వరంగల్‌లో సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీలత నుంచి బుధవారం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నియామకపత్రాన్ని బుధవారం అందుకుంది. సత్తుపల్లిలోని బాలికల జూనియర్ కళాశాలలో తొలి పోస్టింగ్ పొందింది. కష్టాల కడలి నుంచి వచ్చిన తనకు పేద పిల్లలుండే హాస్టల్‌లో పనిచేసే అవకాశం రావడాన్ని గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని 'నమస్తే తెలంగాణ'తో ఉపేంద్రమ్మ పేర్కొంది.

## హైదరాబాద్‌లో జరిగే వర్క్‌షాపునకు డీఈవో



డీఈవోకు అభినందనలు తెలుపుతున్న కార్యాలయ ఉద్యోగులు

ఖమ్మం అర్బన్, మే 1: హైదరాబాద్‌లో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు అన్ని జిల్లాల డీఈవోలకు నిర్వహించే వర్క్‌షాపు ఖమ్మం డీఈవో సామినేని సత్యనారాయణ హాజరుకానున్నారు. వర్క్‌షాపునకు డీఈఓతో పాటు ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ హాజరుకానున్నారు. మూడు రోజుల పాటు ఇన్‌చార్జి డీఈవో బాధ్యతలను కార్యాలయ సూపరింటెండెంట్ చావా శ్రీనివాసరావుకు అప్పగించారు.

**డీఈవోగా బాధ్యతల స్వీకరణ..**

జిల్లా విద్యాశాఖాధికారిగా సామినేని సత్యనారాయణ గురువారం ఉదయం డీఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌లు చావా శ్రీనివాసరావు, శ్రీధర్‌బాబు, సెక్టోరల్ అధికారులు కే రవికుమార్, రాజశేఖర్,రామకృష్ణ, భాను, తులసి, స్టాఫ్ సెక్రటరీ దేవేందర్, యూసుఫ్ తదితరులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

## వేసవి క్రీడాశిక్షణ శిబిరం ప్రారంభం



క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో ప్రభాకర్

మధిర, మే 1: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఎంఈవో వై.ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి క్రీడా శిక్షణ అవకాశాన్ని క్రీడాకారులు, విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పాటిబండ్ల సత్యంబాబు, కర్నాటి రామారావు, సూరంశెట్టి కిషోర్, మిరియాల వెంకటరమణగుప్త, అడ్మినిస్ట్రేటర్ కమ్ ఇన్‌చార్జి చిన్ని, షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ సునీల్, కబడ్డీ కోచ్ ప్రవీణ్ కుమార్, మధిర సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు విజయభాస్కర్ పాల్గొన్నారు.

## బోనకల్లులో బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రురావత్ రమాదేవి

బోనకల్లు, మే 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంపీడీవో రురావత్ రమాదేవి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలరోజుల పాటు నిర్వహించే శిబిరంలో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులు శిక్షణ పొంది క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. జిల్లా డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షించి శిక్షణ అంతనంర సర్టిఫికెట్లు ఇస్తారని పేర్కొన్నారు. బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులకు కోచ్ అమరేషు లింగయ్య శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులు సీహెచ్.జగదీష్, కే.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616



ఖమ్మం: మాట్లాడుతున్న పగడాల నాగరాజు



కూసుమంచి: నేలకొండపల్లిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య



వైరా టౌన్: మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రవి

# ప్రపంచ కార్మికులారా.. ఏకంకండి..

### ఉమ్మడి ఖమ్మం జిల్లా మే డే వేడుకల్లో కార్మిక సంఘాల నేతలు

*'ప్రపంచ కార్మికులారా ఏకంకండి. శ్రమ దోపిడీ విముక్తి కోసం పోరాడండి. పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప' అంటూ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు నినదించారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మే డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక జెండాలను ఎగురవేశారు. తరువాత కార్మికులంతా కలిసి శ్రామిక జెండాలను చేబూని ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటం వల్లనే కార్మికులకు హక్కులు సంక్రమించాయని, ఎనిమిది గంటల పనివిధానం వంటివి అమలవుతున్నాయని గుర్తుచేశారు. కాగా, ఖమ్మం పత్తి మార్కెట్ యార్డులో బీఆర్‌టీయూ దడవాయి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను బీఆర్‌ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఎగురవేశారు. ఖమ్మం ఏఎంసీ, డీసీసీబీల మాజీ చైర్మన్లు గుండాల కృష్ణ, కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నాయకుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలోనూ వాడవాడలా మేడే వేడుకలు జరిగాయి.*

*-నమస్తే నెట్‌వర్క్, మే 1*



రఘునాథపాలెం: ఖమ్మం పత్తి మార్కెట్‌లో మేడే వేడుకల్లో మాట్లాడుతున్న ఆర్‌జేసీ కృష్ణ



సీపీఐ కార్యాలయంలో జెండా అవిష్కరిస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం



ఖమ్మంలోని బైపాస్‌రోడ్డులో మాస్‌లైన్



ఖమ్మం రూరల్: మాట్లాడుతున్న బాగం హేమంతరావు



పెనుబల్లి: తాళ్లపెంటలో..



బోనకల్లులో..

## ప్రత్యేక విద్యలో రిసోర్స్ పర్సన్ల ఎంపిక పూర్తి

ఖమ్మం అర్బన్,మే 1: ప్రత్యేక విద్య శిక్షణకు జిల్లా స్థాయిలో నలుగురు రిసోర్స్ పర్సన్లను ఎంపిక చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్సీ–2024లో భాగంగా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ ఈలప్రోలు కృష్ణారావు, ఎస్టీటీ జీ కల్యాణి, ఐఈఆర్పీలుగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు, రామకృష్ణను జిల్లా రీసోర్స్ పర్సన్లు ఎంపికయ్యారు. ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర రాజధానిలో మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో రాష్ట్ర సాయిలో శిక్షణకు హాజరవుతారు. అనంతరం జిల్లా స్థాయిలో ప్రత్యేక విద్య బోధన సిబ్బందికి శిక్షణ ఇస్తారు. శిక్షణకు సంబంధించి సమాచారాన్ని జిల్లాలోని ఎంఈవోలకు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఇప్పటికే సమాచారమిచ్చారు. ఎస్జీటీ, స్కూల్‌అసిస్టెంట్‌ల విభాగాల్లో డీఆర్పీల ఎంపిక ప్రక్రియ ప్రకటించాల్సి ఉంది.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మధిర, మే 1: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని రొంపిమళ్ల గ్రామంలో గురువారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రొంపిమళ్ల గ్రామానికి చెందిన శీలం మల్లికార్జున్ రెడ్డి(33) తన ఇంట్లో విద్యుత్ బోర్డుకు కూలర్‌కు సంబంధించిన ప్లగ్‌ను పెడుతున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మధిర రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### ధాన్యం కేంద్రాల్లో..

## రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు



పాపటపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- తాలు, తరుగు పేరిట కోత విధిస్తే ఉపేక్షించేది లేదు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీలో కలెక్టర్
- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏపీఎంపై చర్యలకు ఆదేశం

రఘునాథపాలెం, మే 1: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. తాలు లేకుండా, తేమ శాతం 17కి రాగానే సీరియల్ ప్రకారం కాంటా వేసి లారీల ద్వారా ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లి గ్రామంలో శ్రీలక్ష్మి గ్రామ సమాఖ్య ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో నిర్వహణ రిజిస్టర్లు, రైతులు తెచ్చిన ధాన్యం తేమ శాతం, గన్నీ బ్యాగుల వివరాలు పరిశీలించారు. తేమ శాతం తక్కువ వచ్చినా తూకం వేయడం లేదని రైతులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తాలు పేరుతో 6 నుంచి 8 శాతం కోత విధిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు అకాల వర్షం వచ్చినా చేతికొచ్చిన పంటను నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. అయితే, ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, జల్లెడలు సిద్ధంగా ఉంచాలని స్పష్టమైన ఆదేశాలిచ్చినా విధుల్లో నిర్లక్ష్యం చేసిన రఘునాథపాలెం ఏపీఎంపై తక్షణ చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీవో సన్యాసయ్యను కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని తరలించాలని సూచించారు. రవాణా సమస్య రాకుండా అవసరమైన లారీలు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శివకుమార్, అంజలి, రైతులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు




పల్లెక్రీడా ప్రాంగణంలో రైతులు నిల్వఉంచిన ధాన్యం, వరిధాన్యాన్ని తహసీల్దార్‌కు చూయిస్తున్న రైతులు

### - ధాన్యం కొనే వారు లేక రోజుల తరబడి రైతుల అవస్థలు

### - పట్టించుకోని అధికారులు

కారేపల్లి, మే 1: మండలంలోని విశ్వనాథపల్లి, సీతారాంపురం గ్రామపంచాయతీల్లో విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు ఆశించిన మేరకు కొనగోళ్లు జరగటం లేదు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తమ ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. విశ్వనాధపల్లి కొనగోలు కేంద్రంలో కొనుగోలు చేసేవారు లేక పదిహేను రోజుల నుంచి రైతులు ధాన్యం నిల్వచేసుకొని అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో కురిసే అకాల వర్షాలతో ధాన్యం తడిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులుగా అక్కడక్కడా వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో మరింత ఆందోళన పెరుగుతుంది. తహసీల్దార్ సంపత్‌కుమార్ విశ్వనాధపల్లి ధాన్యం కొనగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించి రైతులతో మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో నిల్వఉంచిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేసి తరలించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

#### వర్షాలు పడుతుంటే భయమేస్తుంది



వరిధాన్యాన్ని కొనగోలు కేంద్రానికి తీసుకువచ్చి రెండు వారాలు దాటింది. ఇప్పటి వరకు కొనేవారు జాడ లేరు. రోజు రోజుకు వాతావరణం మారుతుంది. వాన లు పడుతున్నాయి. రేయనకా, పగలనకా కల్లంలోనే కాపలాలుకాస్తున్నాం. వంద క్వింటాలకు పైగా ధాన్యం అమ్మకానికి తీసుకు వచ్చా...ఇంత వరకు కొనగోలు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిల్వఉన్న ధాన్యాం కొనగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

**- వడ్డె వెంకటయ్య, రైతు విశ్వనాధపల్లి**

#### పల్లె క్రీడా ప్రాంగణంలో కల్లం ఏర్పాటు



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దయవల్ల ఏర్పాటు చేసిన పల్లెక్రీడా ప్రాంగణంలో కొనుగోలు కేంద్రాన్ని పెట్టారు. దీంతో రైతులకు కొన్ని రకాల ఇబ్బందులు తప్పాయి. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కాపాడుకోలేక నానా అవస్థలు పడే వాళ్లం. గతంలో ఇన్ని రోజుల తరబడి కల్లాల్లో ధాన్యం నిల్వలు చేయలేదు. వెంటవెంటనే కొని లారీలలో తరలించేవారు. ఇప్పుడు రోజుల తరబడి నిరీక్షిస్తున్నాం.

**- హాలావత్ చిన్నా, కౌలు రైతు,విశ్వనాధపల్లి**

## నేడు స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ప్రారంభం

ఖమ్మం సిటీ, మే 1: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడాకారుల సౌకర్యార్థం రూ. 8.50 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన సింథటిక్ ట్రాక్‌ను శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని జిల్లా యువజన, క్రీడల శాఖ అభివృద్ధి అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జిల్లా క్రీడాకారుల కోసం ఈట్రాక్ జాతీయ స్థాయి పోటీలకు వేదిక కానుందన్నారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్లేస్‌మెంట్స్‌లో 22మంది ఎంపిక

ఖమ్మం అర్బన్, మే 1:నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో 22మంది విద్యార్థులు ఎంపికయ్యారని చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

## విలువలతో కూడిన విద్య అందించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, అధ్యాపకులు

బోనకల్లు, మే 1: విద్యార్థులకు విలువలు, క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని ఇంటర్ బోర్డు ప్రత్యేక అధికారి సీహెచ్.యాదగిరి, ఖమ్మం డీఐఈవో రవిబాబు ఆదేశించారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్‌బోర్డు డైరెక్టర్ కృష్ణఆదిత్య ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు బోనకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడమే ఇంటర్ బోర్డు లక్ష్యమని తెలిపారు. అనంతరం అడ్మిషన్ల ప్రచారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఐఈవో కార్యాలయ ఏవో సంజయ్, ప్రిన్సిపాల్ నళినిశ్రీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గణేషులపాడులో 'మా ఇంటి మణిదీపం'



మల్లపల్లి జ్యోత్స్న, అప్పారావు దంపతులను సన్మానిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పెనుబల్లి, మే 1: మండలంలోని గణేషులపాడు గ్రామానికి చెందిన మల్లపల్లి జ్యోత్స్న, అప్పారావు దంపతులకు ఆడపిల్ల జన్మించిన సందర్భంగా గురువారం 'మా ఇంట మణిదీపం' కార్యక్రమంలో భాగంగా గురువారం వారిని సన్మానించి స్వీట్ బాక్స్‌ను అందించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో మెహరున్నిస్సాబేగం, సెక్టార్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, గ్రామపంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రావు, ఏఎన్‌ఎం నాగేశ్వరి, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు ఉదయలక్ష్మి, స్వర్ణకుమారి, ఆశా రత్నకుమారి పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగుసాహితీ సంబురాలకు ఐలయ్యకు ఆహ్వానం



ఖమ్మం రూరల్, మే 1: మండలంలోని మంగళగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, కవి, రచయిత పంజాల ఐలయ్యకు ప్రపంచ తెలుగు సాహితీ సంబురాల నిర్వాహణ కమిటీ నుంచి గురువారం ఆహ్వానం అందినట్లు ఐలయ్య తెలిపారు. ఈ నెల10,11 తేదీల్లో ఏపీలోని ఏలూరులో జరిగే ప్రపంచ కవితోత్సవం, సాహిత్య సదస్సులో ఐలయ్య పాల్గొననున్నారు. ఐలయ్యకు అరుదైన అవకాశం రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ కమిటీపై ఎంపీడీవోకు ఫిర్యాదు



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న బచ్చోడు గ్రామస్తులు

తిరుమలాయపాలెం, మే 1: మండలంలోని బచ్చోడులో ఇందిరమ్మ కమిటీ సభ్యులు అనర్హులకు ఇళ్లు సిఫార్సు చేశారని, అసలైన అర్హులకు అన్యాయం జరిగిందని నిరుపేదలు గురువారం ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్‌కు ఫిర్యాదు చేశారు. ధనికులకు, ఉద్యోగులకు, ఇళ్లు ఉన్నావారికి కాంగ్రెస్ నాయకులకే ఇళ్లు వచ్చాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీలను రద్దుచేసి అధికారులే సర్వే చేసి అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాణి, రేణుక, నాగమణి, కుమారి, సుకన్య, ధనమ్మ పాల్గొన్నారు.

## ఏవో రవికి సన్మానం



ఏవో రవిని సన్మానిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్, మే 1: 6వ అదనపు జిల్లా కోర్టు ఏవో బోయనపల్లి రవి పదవీ విరమణ సన్మాన సభ బుధవారం రాత్రి నిర్వహించారు. సత్తుపల్లి కోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో 6వ అదనపు జిల్లా జడ్జీ మారగాని శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జీ మీరాఖాసీంసాహేబ్ పాల్గొని ఏవోను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరాజు, సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముబిన్‌అహ్మద్, బార్ ప్రెసిడెంట్ మల్లెపూల వెంకటేశ్వరరావు, కార్యదర్శి, న్యాయవాదులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తిరుమలాయపాలెం, మే 1: మండలంలోని రాజారం గ్రామానికి చెందిన వీరబోయిన లింగయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి మంజూరైన రూ.31,500 చెక్కును గురువారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, వెంకటరెడ్డి, బస్వారెడ్డి, రవీంద్రచారీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మోహన్‌రావుకు పరామర్శ

మధిర, మే 1: మండలంలోని దేశినేనిపాలెం మాజీ సర్పంచ్ మందలపు మోహన్‌రావు మాతృమూర్తి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు గురువారం మాజీ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ అప్పారావు, మాజీ ఎంపీటీసీ పూర్ణచంద్రరావు, మెట్టెల ప్రసాద్ ఉన్నారు.